E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



గంటకు 400 కిలోమీటర్లు! » 3లో

(తేదీ) 31-08-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

ఐటీఆర్ ఫైల్ చేస్తు న్నారా.. ఈ పత్రాలు సిద్ధం చేసుకోండి » 4లో



అక్షయ్‌కుమార్ సైఫ్ మూవీలో హీరో యిన్‌గా.. ఎవరీ సయామీ ఖేర్? » 5లో



SSMB29 షూటింగ్ ఫొటోలు.. ప్రియాంక చోప్రా పోస్ట్ » 5లో



ధోనీకి బీసీసీఐ స్పెషల్ ఆఫర్..! గంభీర్ అంగీ కరిస్తాడా? » 6లో



## భారత్‌చైనా స్నేహం చిగురించేనా?

» ఏడేళ్ల తర్వాత ఆ దేశంలో అడుగిడిన భారత ప్రధాని
» నేడు జిన్‌పింగ్‌తో కీలక చర్చలు
» జపాన్‌లో ముగిసిన పర్యటన
» బుల్లెట్ రైల్లో దేశాధినేతతో ముచ్చట్లు



ఈకబురు,, తియాంజిన్, టోక్యో: భారత ప్రధాని నరేంద్ర మోదీ దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత శనివారం చైనా గడ్డపై అడుగుపెట్టారు. ఆది, సోమవారాల్లో తియాంజిన్‌లో జరిగే 'షాంఘై సహకార సంస్థ' (ఎస్‌సీవో) వార్షిక శిఖరా గ్ర సదస్సులో పాల్గొనడంతోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆదివారం కీలక చర్చలు జరపబోతున్నారు. అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో భారత్‌చైనా సన్ని హితమవుతున్నాయి. ఈ తరుణంలో జరగనున్న చర్చలపై ప్రపంచవ్యాప్త ఆసక్తి వ్యక్తమవుతోంది.

తరువాయి 2లో



## ఉదయం బిల్లులు, సాయంత్రం నివేదికపై చర్చ

» శాసనసభ బీఏసీ సమావేశంలో నిర్ణయం
» వర్షా లు, యూరియాపై చర్చకు బీఆర్ఎస్ పట్టు
» నివేదిక వచ్చాక చర్చిద్దామన్న భట్టి, శ్రీధర్‌బాబు
» బీఏసీ నుంచి హరీశ్, ప్రశాంత్‌రెడ్డి వాకౌట్

ఈకబురు,హైదరాబాద్, : స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేం దుకు వీలుగా పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల సవరణ బి ల్లులతోపాటు కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్‌ను నివేదికను ఒకే సారి అసెంబ్లీలో ప్రవేశపె ట్టాలని శాసనసభ బీఏసీ సమా వేశంలో నిర్ణయించారు. ఉద యాన్నే బిల్లులపై చర్చ చేపట్టి ఆమోదించాక, సాయంత్రం నివేదికపై చర్చ చేపట్టనున్నారు.

తరువాయి 2లో

## బిహార్ ఎన్నికల్లో ఒక్క ఓటూ చోరీ కానివ్వం: రాహుల్



» 'ఓటర్ అధికార్ యాత్ర'లో రాహుల్‌గాంధీ

తరువాయి3లో

## యూరియా కొరతపై భారత రాష్ట్ర సమితి నిరసన

» వ్యవసాయ కమిషనరేట్ ముట్టడి
» సచివాలయం గేటు ఎదుట బైఠాయింపు
» అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్



ఈకబురు,హైదరాబాద్,: యూరియా కొరత తీర్చాలంటూ భారత రాష్ట్ర సమితి నేతలు శనివారం ఖాళీ ఎరువుల సంచులతో హైదరాబాద్ గన్‌పార్కులోని తెలంగాణ అమరవీ రుల స్తూపం వద్ద వినూత్న నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత తీర్చటంలో కాంగ్రెస్ ప్రభు త్వం విఫలమైందని విమర్శించారు. 'గణపతి బప్పా మోరియాకావాల య్యా యూరియా' అంటూ నినాదాలు చేశారు.

తరువాయి 2లో

## అజారుద్దీన్‌కు జాక్‌పాట్!



» అనూహ్యంగా వరించిన ఎమ్మెల్సీ పోస్టు
» కలిసి వచ్చిన సమీకరణాలు
» మంత్రి అయ్యే ఛాన్స్!!

ఈకబురు,దరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధినేత కోదండరాం, మాజీ క్రికెటర్ అజారుద్దీ న్‌లను ప్రతిపాదిస్తూ.. రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంతో అజారుద్దీన్ జాక్‌పాట్ కొట్టినట్లయింది. హైదరా బాదీ.. ముస్లిం వర్గానికి చెందిన వాడు కావడంతో సమీకరణాలు కలిసి..

తరువాయి3లో



## నమ్మిన సిద్ధాంతాన్ని చివరివరకూ వీడని సురవరం

» ఆయన సలహాతోనే తెలుగు వర్సిటీకి ప్రతాపరెడ్డి పేరు
» పాలమూరు ప్రాంతానికి వన్నె తెచ్చారు... సీఎం రేవంత్‌రెడ్డి

ఈ కబురు, హైదరాబాద్, : దరాబాద్: తాను నమ్మిన సిద్ధాంతాన్ని సురవరం సుధాకర్‌రెడ్డి చివరివరకూ వీడలేదని ముఖ్యమంత్రి రే వంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ స్థాయికి ఎదిగి, పాలమూరు ప్రాంతానికి వన్నెతెచ్చారని కొనియాడారు. ఇటీవల కన్ను మూసిన సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను శనివారం రవీంద్రభా

తరువాయి3లో

## బీసీలకు 42%రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు



» పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులు ఆమోదించిన మంత్రివర్గం
» రెండు బిల్లులు శాసనసభలో ఆమోదించి గవర్నర్ ఆమోదానికి పంపాలని నిర్ణయం
» బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు వీలుగా బిల్లులు రూపొందించిన సర్కారు
» గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్
» వరద నష్టంపై నేడు జిల్లా కలెక్టర్లు, మంత్రులతో సీఎం సమీక్ష
» కేబినెట్ భేటీ నిర్ణయాలు వెల్లడించిన మంత్రులు పొన్నం, పొంగులేటి
» కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఈకబురు,, హైదరాబాద్: రిజర్వేషన్లపై 50% గరిష్ఠ పరిమితి ఎత్తివేసి పంచాయతీరాజ్, పురపా లక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వే షన్లు కల్పిం చేందుకు వీలుగా రూపొందించిన పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర శాసనసభలో ఈ రెండు బిల్లులను ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం శాసనసభ కమిటీ హాల్లో సమావేశమైన కేబినెట్ పలు కీలక ని ర్ణయాలు తీసుకుంది. అనంతరం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

తరువాయి 2లో

## అసెంబ్లీ నేడు ఒక్కరోజే

» వర్షా కాల సమావేశాలు నేటితో ముగించాలని నిర్ణయం
» బీఏసీ సమావేశంలో ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం
» ఆదివారం సభ ముందుకు 'కాళేశ్వరం'పై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు.. చర్చ
» ఆ తర్వాత స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేతకు సంబంధించిన బిల్లులు
» ప్రజా సమస్యలపై 15 రోజుల పాటు చర్చించాలని బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం ప్రతిపాదన
» ప్రభుత్వం అంగీకరించకపోవడంతో బీఆర్ఎస్ వాకౌట్



తరువాయి 3లో



## మాదక ద్రవ్యాల కట్టడికి ప్రజా ఉద్యమం: కిషన్‌రెడ్డి

తరువాయి3లో

## ఎరువుల కొరతపై బీఆర్ఎస్ పోరు..

పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరెస్ట్



» 2లో

మొదటి పేజీ తరువాయి

# బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు



ఈకబురు,, హైదరాబాద్: రిజర్వేషన్లపై 50% గరిష్ట పరిమితి ఎత్తివేసి పంచాయతీరాజ్, పురపాలక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా రూపొందించిన పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లులను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర శాసనసభలో ఈ రెండు బిల్లులను ఆమోదించి రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం పంపాలని నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం శాసనసభ కమిటీ హాల్లో సమావేశమైన కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు.

బీసీ కోటా పెంపునకు అడ్డంకిగా

నాటి బిల్లులు: బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. స్థానిక సంస్థలతో పాటు విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించేందుకు గత మార్చిలో శాసనసభలో రెండు బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు పంపించగా, ఆయన ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. రిజర్వేషన్లపై 50% సీలింగ్ విధిస్తూ 2018లో పంచాయతీరాజ్ చట్టానికి, 2019లో మున్సిపల్ చట్టానికి నాటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన సవరణ బిల్లులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా మారాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై 50% సీలింగ్ ఎత్తివేసేందుకు గత మంత్రివర్గ సమావేశంలో ఆర్డినెన్స్‌లను ఆమోదించి గవర్నర్‌కు పంపించగా, ఆయన వాటిని సైతం ఆమోదించకుండా రాష్ట్రపతికి సిఫారసు చేశారని చెప్పారు. మరోవైపు పంచాయతీరాజ్ ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలంటూ హైకోర్టు గడువు విధించిందని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో బీసీ రిజర్వేషన్లపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల న్యాయ నిపుణులతో చర్చించిందని తెలిపారు.

తాజాగా బీసీలకు 42% రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించిందని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందన్నారు. 50% సీలింగ్ ఎత్తివేసేందుకు వీలుగా ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టనున్న రెండు బిల్లుల ఆమోదానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్‌ల పేర్లను ప్రతిపాదించాలని మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలతో సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టంపై ఆదివారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. వర్షాలతో జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు, రైల్వే లైన్లు, చెరువులకు జరిగిన నష్టంపై సమగ్ర అంచనాలను సిద్ధం చేసి పూర్తి వివరాలతో ఈ సమావేశానికి రావాల్సిందిగా మంత్రివర్గం వారిని ఆదేశించిందని తెలిపారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పునరుద్ధరణ, మరమ్మతు పనులకు ఈ సమీక్షలో సీఎం ఆమోదం తెలుపుతారన్నారు.

గోవుల సంక్షేమానికి కొత్త విధానం

గోవుల సంక్షేమానికి విధివిధానాలను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. గోవుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, సీఎస్ఆర్, ఇతర మార్గాల్లో నిధుల సమీకరణ తదితర అంశాలతో ఒక పాలసీని రూపొందించినట్లు పొంగులేటి తెలిపారు. ఇలా వుండగా ప్రాజెక్టులకు వచ్చే వరదలను కచ్చితంగా అంచనా వేసేందుకు అవసరమైన సాంకేతిక పరికరాల సమకూర్చుకోవడానికి కావాల్సిన కేంద్ర నిధుల కోసం నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో చేరాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

డబ్బులు చెల్లించని మిల్లర్లపై పీడీ యాక్ట్

గత ప్రభుత్వం 2022-23 రబీ సీజన్‌లో సమీకరించి మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో ఇంకా 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికవరీ కాలేదని, ఆ ధాన్యానికి సంబంధించిన డబ్బులను రికవరీ చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని పొంగులేటి తెలిపారు. డబ్బులు చెల్లించని మిల్లర్లపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టాలని తీర్మానించామన్నారు. మత్స్య సహకార సంఘాలకు ఎన్నికల నిర్వహణలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో వాటిలోని సభ్యులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు.



మొదటి పేజీ తరువాయి

# మాదక ద్రవ్యాల కట్టడికి ప్రజా ఉద్యమం: కిషన్‌రెడ్డి



**ఈ-కబురు,హైదరాబాద్, : లాలాపేట, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల కట్టడికి ప్రజా ఉద్యమం అవసరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. ఓయూ న్యాయ విభాగం, విజన్-2047 ప్రొఫెషనల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఓయూ దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఓ వలంటీర్ ముందుకు వచ్చి డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనకపోతే ఈ సమస్య నుంచి బయటపడలేమన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ, విజన్-2047 ప్రొఫెషనల్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ హరిచరణ్, ఓయూ రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేశ్‌రెడ్డి, ఓయూ లా కళాశాల డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, వీసీ ఓఎస్డీ ప్రొ. జితేందర్ కుమార్ నాయక్ పాల్గొన్నారు.**

మొదటి పేజీ తరువాయి

# భారత్‌చైనా స్నేహం చిగురించేనా?



ఈకబురు,, తియాంజిన్, టోక్యో: భారత ప్రధాని నరేంద్రమోదీ దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత శనివారం చైనా గడ్డపై అడుగుపెట్టారు. ఆది, సోమవారాల్లో తియాంజిన్‌లో జరిగే 'షాంఘై సహకార సంస్థ' (ఎస్‌సీవో) వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడంతోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆదివారం కీలక చర్చలు జరపబోతున్నారు. అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో భారత్‌చైనా సన్నిహితమవుతున్నాయి. ఈ తరుణంలో జరగనున్న చర్చలపై ప్రపంచవ్యాప్త ఆసక్తి వ్యక్తమవుతోంది. చైనాతో ఆర్థిక సంబంధాలపై ఇరువురు నేతలు సమీక్షించి, తూర్పు లద్దాఖ్ వివాదం తర్వాత దెబ్బతిన్న సంబంధాలను మరింత మెరుగుపరచడంపై చర్చించే అవకాశం ఉంది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఇటీవలే దిల్లీకి వెళ్లి ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకుపోవడంపై చర్చించిన విషయం తెలిసిందే. సరిహద్దులో శాంతి కొనసాగించడం, వాణిజ్యానికి సరిహద్దులు తెరవడం, నేరుగా విమాన సర్వీసులను ప్రవేశపెట్టడం వంటివాటిపై ఇరుపక్షాలూ సుముఖత వ్యక్తం చేశాయి. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు మోదీ 2018లో చివరిసారిగా చైనాకు వచ్చారు. ఈసారి సదస్సులో రష్యా అధినేత పుతిన్ సహా ఆయా దేశాధినేతలతో ఆయన సమావేశం కానున్నారు.

జపాన్ ప్రధానికి ప్రత్యేక కానుకలు

భారత ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా తన జపాన్ పర్యటన కొనసాగిందని మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. జపాన్ ప్రధాని ఇషిబ సహా అక్కడి ప్రజలు తనపై ఎంతో ఆప్యాయత చూపించారంటూ కృతజ్ఞతలు తెలిపారు. రాజస్థానీ శైలిని రంగరించి, ఆంధ్రప్రదేశ్‌లో దొరికే అరుదైన చంద్రకాంత రాయితో చేసిన పాత్రలను, వెండి చాప్‌స్టిక్స్‌ను ఇషిబకు బహూకరించారు. జమ్మూకశ్మీర్ హస్తకళల విశిష్టతను చాటే అత్యంత మృదువైన పశ్మీనా శాలువను కళాత్మకంగా తయారుచేసిన అందమైన పెట్టెలో ఉంచి జపాన్ ప్రధాని సతీమణికి ఇచ్చారు. జపాన్ ప్రధానితో కలిసి టోక్యోకు 300 కి.మీ. దూరంలోని సెండాయ్‌కు బుల్లెట్ రైలులో ప్రయాణించారు. కొత్తగా రూపొందించిన ఆల్ఫాఎక్స్ రైలును ఇద్దరూ పరిశీలించారు. సెండాయ్‌లో సెమీకండక్టర్ ప్లాంటును మోదీ సందర్శించారు. తూర్పు జపాన్ రైల్వే కంపెనీలో శిక్షణ పొందుతున్న భారతీయ లోకో పైలట్లతో ముచ్చటించారు. మోదీ గౌరవార్థం జపాన్ ప్రధాని విందునిచ్చారు.



# ఉదయం బిల్లులు, సాయంత్రం నివేదికపై చర్చ



ఈ-కబురు, హైదరాబాద్: పాఠశాలల నుంచి వర్సిటీల వరకు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచాలని, అందుకు అనుగుణంగా బోధనా సిబ్బందితోపాటు విద్యార్థులకు ముఖ గుర్తింపు హాజరు(ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్-ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని తప్పనిసరి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ గుర్తింపుతో హాజరుశాతం మెరుగుపడుతుందని, వివిధ లోటుపాట్లనూ అరికట్టవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. శుక్రవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై.. సీఎం మూడు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. విద్యారంగంపై చేస్తున్న ఖర్చును వ్యయంగా కాకుండా... పెట్టుబడిగా చూస్తున్నామని ఈ సందర్భంగా సీఎం స్పష్టంచేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలతోపాటు విద్యారంగం అభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిలో 90 శాతానికిపైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఉన్నారని, ఈ విషయాన్ని నిర్ధారించేందుకు గత పదేళ్లలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన వారి వివరాలపై నివేదిక రూపొందించాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఆదేశాలు...నిర్ణయాలు ఇవీ...

విద్యాశాఖ పరిధిలో అదనపు గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం వివిధ విభాగాలు చేపట్టడం సరికాదు. నిర్మాణాల నాణ్యత ప్రమాణాలు, పర్యవేక్షణ, నిధుల మంజూరు, జవాబుదారీతనం కోసం అన్నీ ఒకే విభాగం కింద ఉండాలి. సమీకృత గురుకులాల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్న తెలంగాణ విద్యా సంక్షేమ వసతుల అభివృద్ధి సంస్థ(టీజీఈడబ్ల్యూఐడీసీ) నేతృత్వంలోనే ఇకపై నిర్మాణ పనులు కొనసాగాలి. ఈ సంస్థకు అవసరమైన ఇంజినీరింగ్, ఇతర సిబ్బందిని ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్‌పై సమకూర్చాలి.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీకోసం కంటైనర్ కిచెన్లకు ప్రాధాన్యమివ్వాలి. కంటైనర్లపైన సౌర పలకలు ఏర్పాటుచేసి, అవసరమైన విద్యుత్తు వినియోగించుకోవచ్చు.

మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు గ్రీన్ ఛానల్‌లో జరగాలి. బిల్లుల సమర్పణ కూడా ఆన్‌లైన్‌లోనే సాగాలి. ఈ విషయంలో ఎటువంటి అలసత్వం చూపొద్దు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కింద బడుల్లో పారిశుద్ధ్య పనులకు సంబంధించిన బిల్లులు, 'మన ఊరు-మన బడి' బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

రాష్ట్రంలోని మహిళా కళాశాలలు, బాలికల పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి.

ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి. అవసరమైతే కాంట్రాక్టు విధానంలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించే అంశాన్ని పరిశీలించాలి.

మొదటి పేజీ తరువాయి

# యూరియా కొరతపై భారత రాష్ట్ర సమితి నిరసన



ఈకబురు,హైదరాబాద్, : యూరియా కొరత తీర్చాలంటూ భారత రాష్ట్ర సమితి నేతలు శనివారం ఖాళీ ఎరువుల సంచులతో హైదరాబాద్ గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద వినూత్న నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత తీర్చటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 'గణపతి బప్పా మోరియాకావాలయ్యా యూరియా' అంటూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాట్లాడుతూ.. ''అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజులు నిర్వహించాలి. వ్యవసాయ రంగం మొదలుకొని ఏ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చర్చ పెట్టినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. సాగు విస్తీర్ణం పెంపుతో పాటు రైతు సంక్షేమానికి కేసీఆర్ అమలు చేసిన పథకాలను వివరిస్తాం. కాళేశ్వరంపై అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతాం. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూద్దాం. కేసీఆర్ పాలనాకాలంలో రాష్ట్రంలో ఏ రోజూ ఎరువుల సంక్షోభం కనిపించలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెప్పులు, ఆధార్ కార్డులను క్యూలో పెడుతున్న దురదృష్టకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పండగనాడూ రైతులు వర్షంలో తడుస్తూ గంటల తరబడి నిలబడాల్సి రావడం బాధాకరం. వర్షాలతో పంటలకు నష్టం, రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభం, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల అమలులో వైఫల్యాలు సహా అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చిద్దాం. కాళేశ్వరంపై వేసింది జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కాదు.. పీసీసీ కమిషన్'' అని విమర్శించారు.

ర్యాలీగా వ్యవసాయ కమిషనరేట్‌కు...

గన్‌పార్క్ వద్ద నిరసన అనంతరం భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కేటీఆర్, హరీశ్‌రావు, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, టి.పద్మారావు, కౌశిక్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, గంగుల కమలాకర్, కల్వకుంట్ల సంజయ్, ప్రశాంత్‌రెడ్డి, వివేకానంద, కాలేరు వెంకటేశ్, నిరంజన్‌రెడ్డి, మధుసూదనాచారి, వాణీదేవి, దేశపతి శ్రీనివాస్, శ్రవణ్, ఎల్.రమణలతో పాటు కార్యకర్తలు ర్యాలీగా బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌కు చేరుకున్నారు. కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు, రైతులకు సరిపడా ఎరువులు సరఫరా చేసేవరకు కదిలేది లేదంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు అక్కడే బైఠాయించారు. వారిని పోలీసులు అదుపులో తీసుకుని వ్యాన్‌లలో తరలించారు.

హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డి, శంభీపూర్ రాజు తదితరులు పోలీసు వాహనం నుంచి దిగిపోయి బీఆర్కే భవన్ నుంచి సచివాలయం వైపు పరుగులు తీశారు. బారికేడ్లపై నుంచి దూకి సచివాలయం గేటు వరకు చేరుకున్నారు. పోలీసులు అడ్డుకోవడంతో గేటు ఎదుట బైఠాయించారు. ఉద్రిక్తత నెలకొనడంతో... వారిని పోలీసులు అదుపులో తీసుకుని నగరంలోని వివిధ ఠాణాలకు తరలించారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలేశారు. రైతన్నకు కష్టమొస్తే ఆంక్షలను, ఇనుప కంచెలను లెక్కచేయబోమని హరీశ్‌రావు పేర్కొన్నారు. యూరియా రైతుల హక్కు అని.. దాన్ని అందకుండా చేయడం కాంగ్రెస్, భాజపాల తప్పని విమర్శించారు.

## అసెంబ్లీ సమావేశాలు 15 రోజులు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్

ఈకబురు,హైదరాబాద్, : ఎరువుల కొరతపై బీఆర్ఎస్ పోరు చేపట్టింది. రైతులకు సరిపడా యూరియ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. శనివారం అసెంబ్లీ నుంచి వ్యవసాయ కమిషన్ వద్దకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు ర్యాలీగా వెళ్లారు. అగ్రికల్చర్ కమిషనర్‌కి ఎరువుల సంక్షేమం పైన వినతి పత్రం ఇచ్చిన అనంతరం కమిషనరేట్ కార్యాలయంలో ముందు ధర్నాకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఎరువుల కొరత సమస్య పైన సరైన వివరాలు అందించి పరిష్కార మార్గాలు చూపించేదాకా కదిలేది లేదని నేతలు నిరసన తెలిపారు. పదేళ్లలో లేని ఎరువుల కొరత ఇప్పుడు ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించారు. వర్షంలో తడుస్తూ, అర్ధరాత్రులు ఎరువుల కోసం మహిళా రైతులు రోడ్ల మీద నిలబడి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల కొరతకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమంటూ నినాదాలు చేశారు.

ఈ క్రమంలోనే పోలీసులు బీఆర్ఎస్ నేతలను అడ్డుకోని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్‌తో సహా పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అగ్రికల్చర్ ఆఫీస్ నుంచి సెక్రటేరియట్ ముందు మెరుపు ధర్నాకు దిగారు. హరీశ్‌రావు రన్నింగ్ చేస్తూ సచివాలయం గేటు వద్దకి వచ్చి బైఠాయించి నిరసనలు తెలిపారు. ఇక్కడ కూడా పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు.



మొదటి పేజీ తరువాయి

# అజారుద్దీన్‌కు జాక్‌పాట్!



ఈకబురు,దరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా టీజేఎస్ అధినేత కోదండరాం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌లను ప్రతిపాదిస్తూ.. రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంతో అజారుద్దీన్ జాక్‌పాట్ కొట్టినట్లయింది. హైదరాబాదీ.. ముస్లిం వర్గానికి చెందిన వాడు కావడంతో సమీకరణాలు కలిసి.. రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కేందుకూ ఆస్కారం ఉంది. వాస్తవానికి కోదండరాం, అమెరలీఖాన్‌ల ఎమ్మెల్సీ సభ్యత్వాలను సుప్రీం కోర్టు రద్దు చేసిన తర్వాత.. వారిద్దరినీ తిరిగి ప్రతిపాదించాలా.. లేక వేరే ప్రాధాన్య పదవులు ఇవ్వాలా అన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో, ప్రభుత్వంలో చోటు చేసుకుంది. అయితే ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి సందర్శించినప్పుడు.. కోదండరాంను మరో 15 రోజుల్లో ఎమ్మెల్సీని చేస్తామంటూ ప్రకటించారు. తద్వారా ఆయన విషయంలో గందరగోళానికి తెర దించారు. మంత్రివర్గంలో చోటుతో ముడిపడి ఉండడంతో అమెరలీఖాన్ సీటు విషయంలో పెద్ద ఎత్తున తర్జన భర్జన నడిచింది.

చివరికి పార్టీ అధిష్ఠానం అజారుద్దీన్‌కే ఓటు వేసింది. అమెరలీఖాన్‌ను ఏదైనా కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ సీటు నుంచి పోటీ చేసి ఓటమిపాలైన అజారుద్దీన్.. ఉప ఎన్నికల్లో అదే స్థానం నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అజారుద్దీన్‌తో పాటుగా డజను మంది నాయకులు అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్నారు. ఇంత పోటీ వాతావరణంలో అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీగా అవకాశం దక్కడం.. మంత్రివర్గంలో చోటు దక్కేందుకూ అవకాశాలుండడం.. నిజంగా జాక్‌పాటేనని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# జెట్ ఇంజిన్లను తయారుచేస్తాం



ఈ-కబురు,ఢిల్లీ, నోయిడా: ఉగ్రవాదం, ప్రాంతీయ సంఘర్షణలు, వాణిజ్య యుద్ధాలతో నిండిపోయిన ప్రస్తుత కాలంలో విదేశీ సరఫరాలపై భారత రక్షణ రంగం ఆధారపడటం మంచిది కాదని, దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడటంలో సైనిక స్వావలంబన అత్యంత కీలకమైనదని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఢిల్లీలో ఓ ప్రముఖ మీడియా సంస్థ నిర్వహించిన రక్షణ సదస్సులో ప్రసంగించారు. ప్రతిపాదిత సుదర్శన చక్ర గగనతల రక్షణ వ్యవస్థను రానున్న 10 ఏళ్లల్లో పూర్తిగా అభివృద్ధిచేసి, దీనిని దేశంలోని కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని అన్నారు. శక్తిమంతమైన స్వదేశీ జెట్ ఇంజిన్లను అభివృద్ధిచేసే సవాలును భారత్ స్వీకరించిందని, ఈ కీలకమైన ప్రాజెక్టుకు సన్నాహాలు పూర్తయ్యాయని, అతి త్వరలోనే దీని ఫలితాలు కనిపిస్తాయని రాజ్‌నాథ్ తెలిపారు."భారత్ ఎవరితో శత్రుత్వాన్ని కోరుకోదు. కానీ తన ప్రయోజనాల విషయంలో రాజీపడదు. దేశ ప్రజలు, రైతులు, చిరువ్యాపారుల సంక్షేమమే మాకు ప్రాధాన్యం. భారత్‌ను ఎంత ఒత్తిడికి గురిచేస్తే అంత ఎత్తుకు ఎదుగుతుంది" అంటూ అమెరికా విధిస్తున్న సుంకాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అనంతరం ఆయన ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాకు చేరుకుని రఫే ఎంఫిబీర్ ప్రైవేట్ లిమిటెడ్ రక్షణ పరికరాల పరిశ్రమ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు. ఆధునిక యుద్ధంలో డ్రోన్లు కీలక వ్యూహంగా మారాయని, వీటిని యుద్ధంలో భాగం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని

# నమ్మిన సిద్ధాంతాన్ని చివరివరకూ వీడని సురవరం







ఈకబురు,హైదరాబాద్, : దరాబాద్: తాను నమ్మిన సిద్ధాంతాన్ని సురవరం సుధాకర్‌రెడ్డి చివరివరకూ వీడలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ స్థాయికి ఎదిగి, పాలమూరు ప్రాంతానికి వన్నెతెచ్చారని కొనియాడారు. ఇటీవల కన్నుమూసిన సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. దీనికి సీఎం ముఖ్యఅతిథిగా హాజరై సుధాకర్‌రెడ్డిపై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.''పేదల జీవితాల్లో మార్పు కోసం సుధాకర్‌రెడ్డి శ్రమించారు. ఆయన సలహాతోనే తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాం. తెలంగాణ స్ఫూర్తిని చాటుతూ మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాం. ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేయబోతున్నాం. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. 'వన్ పర్సన్ వన్ పార్టీ ఎలెక్షన్'గా మారిపోయింది. రాజ్యాంగాన్ని మార్చాలని యోచిస్తున్న వారి నుంచి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రకు అందరూ అండగా నిలబడాలి'' అని రేవంత్‌రెడ్డి కోరారు.

ఆయన జీవితం ఆదర్శం: డి.రాజా

సిద్ధాంతం కోసం సురవరం నీతి, నిజాయతీలతో పనిచేశారని, ఆయన జీవితం నేతలకు ఆదర్శమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. 2019లో సురవరం నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాని, తన పేరును ఆయనే ప్రతిపాదించారంటూ భావోద్వేగానికి గురయ్యారు. ప్రతి సందర్భంలో తనను చేయిపట్టి నడిపించారంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సైతం భావోద్వేగానికి గురయ్యారు.

సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి విజయలక్ష్మి మాట్లాడుతూ... తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 4.5 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దాన్ని డిగ్రీ కళాశాల లేదా క్రీడలకు ఉపయోగించాలని కోరారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ ఈటల రాజేందర్, సీపీఐ తెలంగాణ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏపీ కార్యదర్శి రామకృష్ణ, గోరటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

**సుధాకర్‌రెడ్డి వంటి నేతలు అవసరం: జస్టిస్ ఎన్.వి.రమణ**

దేశంలో ప్రజాస్వామ్యం బతకాలంటే సురవరం వంటి నేతలు అవసరమని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు. 'పేదల బతుకులు మారాలంటే కమ్యూనిస్టులు ఏకం కావాలి. మా నాన్న కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా పనిచేశారు. మా ఇల్లు గతంలో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంగా ఉండేది. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న అనేకమంది మా ఊరిలో ఆశ్రయం పొందారు. కమ్యూనిస్టులు నిజాయతీగా పనిచేస్తారనే భావన ప్రపంచవ్యాప్తంగా ఉంది' అని ఆయన అన్నారు.

# బిహార్ ఎన్నికల్లో ఒక్క ఓటూ చోరీ కానివ్వం: రాహుల్



ఈకబురు,ఆరా(బిహార్): భాజపా, ఆరెస్సెస్, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఆరోపించారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా శనివారం బిహార్‌లోని ఆరాలో ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తేజస్వీ యాదవ్, అఖిలేశ్ యాదవ్‌తో కలిసి రాహుల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో భాజపాపై రాహుల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఓట్లు చోరీ చేయడంలో ఎన్డీయే ప్రభుత్వం విజయవంతమైందని ఆరోపించారు. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని చెప్పారు. ర్యాలీలో పాల్గొన్న సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో తాను కలిసి ఉన్న ఫొటోను ఎక్స్‌లో రాహుల్ షేర్ చేశారు. ''ఇద్దరు సోదరులు కలిశారు. ఓట్ల దొంగలిక నాశనమే. ఈ యాత్రలో పాల్గొని నాకు, తేజస్వికి మద్దతిచ్చిన అఖిలేశ్‌కు ధన్యవాదాలు'' అని రాహుల్ పేర్కొన్నారు.

రాహుల్‌గాంధీ 'ఓటు చోరీ' ఆరోపణలపై కేంద్ర మాజీ మంత్రి ఉమాభారతి స్పందించారు. ''కేవలం ఎన్నికల కమిషన్‌తో ఎన్నికలు నెగ్గలేం. ప్రజల హృదయాలను గెలుచుకోవడం ద్వారానే సాధ్యం'' అని అన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు గుర్తుంచుకోవాలని ఆమె తెలిపారు.

# అసెంబ్లీ నేడు ఒక్కరోజే

ఈకబురు:రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలు రెండోరోజు ఆదివారంతోనే ముగించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. పలు జిల్లాల్లో వర్ష బీభత్సం, గణేశ్ నిమజ్జనం తదితరాల నేపథ్యంలో ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అవసరమైతే కొద్ది విరామం తర్వాత మళ్లీ సమావేశాలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు శనివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) భేటీలో ప్రభుత్వం ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తో పాటు బీజేపీ, ఎంఐఎం పార్టీలు కూడా కనీసం 15 రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని కోరినట్లు తెలిసింది. ఆ ప్రతిపాదనకు ప్రభుత్వం అంగీకరించక పోవడంతో భేటీ నుంచి బీఆర్‌ఎస్ వాకౌట్ చేసింది.

కాళేశ్వరం నివేదిక సమర్పించనున్న సీఎం

ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీసీ ఘోష్ కమిషన్ పూర్తి నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు సమర్పిస్తారు. దీనిపై చర్చ అనంతరం పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులపై కూడా సభలో చర్చిస్తారు. స్థానిక సంస్థలతో పాటు మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లకు సంబంధించి ఉన్న గరిష్ఠ పరిమితిని ఎత్తివేస్తూ సవరణలు ప్రతిపాదిస్తారు. పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 285 (ఎ)కు సవరణల ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పీపీటీకి బీఆర్‌ఎస్ పట్టు

పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు అవకాశం ఇవ్వాలని బీఏసీ భేటీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. ఈ విజ్ఞాపనను పరిశీలిస్తానని స్పీకర్ హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఇక కాళేశ్వరం నివేదికపై అసెంబ్లీలో జరిగే చర్చలో ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ పాల్గొనే అవకాశాలు కనిపించడం లేదు. అయితే సభలో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ ఇప్పటికే దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. యూరియా కొరత, వరద బీభత్సం, విషజ్వరాలు, గురుకులాల్లో విద్యార్థుల మరణాలు తదితర ప్రజా సమస్యలపై చర్చించాలని బీఏసీ సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రతిపాదించింది.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, హరీశ్‌రావుతో పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్షం నాయకుడు ఏ.మహేశ్వర్‌రెడ్డి ఈ భేటీలో పాల్గొన్నారు. ఇక శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండలి బీఏసీ సమావేశంలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబుతో పాటు డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్ గౌడ్, నెల్లికంటి సత్యం, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు పాల్గొన్నారు.



# హైకోర్టులో కేసీఆర్, హరీశ్ మధ్యంతర దరఖాస్తులు





హైదరాబాద్, ఈకబురు,: కాళేశ్వరం కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించినా తక్షణం ఎలాంటి చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన హయాంలో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు శనివారం మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ఇప్పటికే రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వాటిపై తుది తీర్పు వెలువడే వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక అక్రమమని, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8బీ, 8సీ కింద తమకు నోటీసు ఇవ్వకుండా తమ ప్రతిష్ఠ దెబ్బతీసేలా కమిషన్ నిర్ధారణలు చేసిందని, సదరు కమిషన్ నివేదికను కొట్టేయాలని కోరుతూ ఇప్పటికే కేసీఆర్, హరీశ్‌లు హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. కమిషన్ నివేదికను అసెంబ్లీ ఎదుట ఉంచి చర్చించే వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం చెప్పడంతో వారిద్దరి పిటిషన్లపై హైకోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన తర్వాత ప్రభుత్వం తమపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని, అసెంబ్లీలో చర్చించిన తర్వాత కూడా తమపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ తాజాగా శనివారం కేసీఆర్, హరీశ్‌లు మధ్యంతర దరఖాస్తులు దాఖలు చేశారు.శాసనసభలో చర్చించిన తర్వాతే చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం చెప్పే ప్రమాదం ఉందని.. అసెంబ్లీలో చర్చించామనే కారణాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ కక్ష తీర్చుకోవాలని, పిటిషనర్ల కీర్తి ప్రతిష్ఠలను, పేరు ప్రఖ్యాతులను దెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. సెక్షన్ 8బీ, సెక్షన్ 8సీ కింద నోటీసు ఇవ్వకుండా వెలువరించిన కమిషన్ నివేదికే అక్రమమని, సదరు అక్రమ నివేదిక ఆధారంగా ప్రభుత్వం దురుద్దేశంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీలో చర్చిం చాం కాబట్టి చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం సమర్థించుకునే అవకాశం ఉందని, అలా చేస్తే తిరిగి పూరించలేని విధంగా తమకు నష్టం జరుగుతుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో అసెంబ్లీలో చర్చించినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా స్టే ఇవ్వడంతోపాటు ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్లలో హైకోర్టు తుది తీర్పు ప్రకటించే వరకు కమిషన్ నివేదికను సస్పెండ్ చేయాలని కోరారు. ఈ మధ్యంతర దరఖాస్తులు ప్రధాన పిటిషన్లతో కలిపి రెగ్యులర్ విధానంలో త్వరలో విచారణకురానున్నట్లు తెలిసింది.

# పార్టీలకు అతీతంగా మద్దతివ్వండి

ఈకబురు,రాంచీ: లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరూ పార్టీలకు అతీతంగా.. యోగ్యత ప్రాతిపదికన తనకు మద్దతు తెలపాలని ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎంపీలందరికీ లేఖలు రాసినట్లు తెలిపారు. భాజపాకు చెందిన ఉన్నతస్థాయి నాయకత్వాన్ని కలిసి మద్దతు కోరడానికి తాను సిద్ధమేనని, ఆ పార్టీ నేతలు అనుమతిస్తే వారిని కలుస్తానని శనివారం రాంచీలో చెప్పారు. దేశంలో ఇటీవలి కాలంలో అత్యంత హుందాగా, న్యాయంగా, నిష్పక్షపాతంగా నిర్వహించిన ఎన్నికగా ఇది మిగిలిపోవాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను నిర్బంధించిన కేంద్ర ప్రభుత్వ చర్యను ఆయన ఖండించారు. ''రాజ్యాంగ పదవుల్లో ఉంటూ ఝార్ఖండ్ ముఖ్యమంత్రిని కేసులో ఇరికించినవారు ముఖ్యమంత్రిని చిత్రహింసలకు గురిచేశారు. ఆయన గౌరవానికి భంగం కలిగించారు. పౌరుల మాదిరిగానే ముఖ్యమంత్రికి రాజ్యాంగం ప్రసాదించిన గౌరవానికి భంగం కలిగించినవారు దీనికి బాధ్యత వహించాలి'' అని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఝార్ఖండ్‌కు విచ్చేసిన ఆయనకు రాంచీ విమానాశ్రయంలో కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు.



# గంటకు 400 కిలోమీటర్లు!

**దేశంలో మొట్టమొదటి హైస్పీడ్ బుల్లెట్ రైలు**

**'ఈ–10' షింకన్సెన్ రైళ్లు పంపనున్న జపాన్**

**ముంబై–సబర్మతి మధ్య 2030లో పరుగు**

**ప్రాజెక్టు వ్యయం రూ.1,08,000 కోట్లు**

ఈకబురు,భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు పనులు ఊపందుకున్నాయి. గుజరాత్‌లోని స్టేషన్లలో సివిల్ పనులు పూర్తి అయ్యాయని రైల్వే శాఖ ప్రకటించింది. అత్యాధునిక సాంకేతికతతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో భాగంగా ఈస్ట్ జపాన్ రైల్వే కంపెనీ అభివృద్ధి చేస్తున్న 'ఈ-10' షింకన్సెన్ బుల్లెట్ రైలు 2030లో పట్టాలెక్కనుంది. గంటకు 400 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడం ఈ ట్రైన్ ప్రత్యేకత.జపాన్ పర్యటనలో భాగంగా షింకన్సెన్ బుల్లెట్ రైలులో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణించడం ప్రాధాన్యత సంతరించుకుంది. జపాన్ సహకారంతో ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టును భారత ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. హై స్పీడ్ రైల్ నడపడం కోసం అక్కడ శిక్షణ పొందుతున్న భారత డ్రైవర్లతోనూ మోదీ ముచ్చటించారు. ఈ నేపథ్యంలో దేశంలోని తొలి హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు మరోసారి వార్తల్లోకెక్కింది.

508 కి.మీ. కారిడార్

బుల్లెట్ రైలు ప్రాజెక్టు గుజరాత్, మహారాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీల గుండా పోతుంది. మొత్తం కారిడార్ పొడవు 508 కిలోమీటర్లు. ఇందులో 12 స్టేషన్లు ఉంటాయి. వీటిలో మహారాష్ట్రలో నాలుగు, గుజరాత్‌లో ఎనిమిది రానున్నాయి. మహారాష్ట్రలో ముంబై స్టేషన్ భూగర్భంలో నిర్మిస్తుండగా మిగిలిన థానే, విరార్, బోయిసర్, అలాగే గుజరాత్‌లోని వాపి, బిలిమోరా, సూరత్, భారుచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి వద్ద ఎలివేటెడ్ స్టేషన్స్ రానున్నాయి. మొత్తం 8 స్టేషన్లలో ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి.

395 కి.మీ పీయర్ పనులు, 407 కి.మీ. ఫౌండేషన్, 337 కి.మీ. గర్డర్ క్యాస్టింగ్ కూడా పూర్తయ్యాయి.

17 రివర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయింది. మరో 9 రివర్ బ్రిడ్జిల నిర్మాణం పూర్తికావచ్చింది.

317 కి.మీ. వయడక్ట్ నిర్మాణం కూడా పూర్తయింది.

గుజరాత్‌లో 198 కిలోమీటర్ల ట్రాక్ సిద్ధమైంది.

ట్రయల్ రన్ 2027లో..

గుజరాత్‌లో మొదటి 50 కిలోమీటర్ల మార్గంలో 2027లో బుల్లెట్ రైలు పరుగు తీయనుంది. గుజరాత్‌లోని స్టేషన్ల నిర్మాణం 2027 డిసెంబర్ నాటికి, మొత్తం ప్రాజెక్టు 2029 డిసెంబర్ నాటికి పూర్తవుతుందని రైల్వే శాఖ ప్రకటించింది.

రూ.78,839 కోట్ల వ్యయం

ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1,08,000 కోట్లు. ఈ ఏడాది జూన్ 30 నాటికి రూ.78,839 కోట్లు ఖర్చు చేశారు.

ప్రాజెక్టు అంచనా వ్యయంలో 81 శాతం మొత్తాన్ని జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జికా) ద్వారా జపాన్ ప్రభుత్వం సమకూరుస్తోంది.

ఈ ప్రాజెక్టులో రైల్వే శాఖకు 50 శాతం; మహారాష్ట్ర, గుజరాత్ ప్రభుత్వాలకు చెరి 25 శాతం వాటా ఉంది. ఆర్థిక సహాయంతోపాటు భారత్‌లో సమాచార సేకరణ, పరీక్షల కోసం రెండు షింకన్సన్ రైళ్లను జికా ఉచితంగా సరఫరా చేస్తోంది.

స్థల సేకరణ పూర్తి

మహారాష్ట్రలో భూసేకరణ, అనుమతుల జాప్యం, కోవిడ్-19 మహమ్మారి.. తదితర కారణాలతో ఈ ప్రాజెక్టు దాదాపు రెండున్నరేళ్లు ఆలస్యం అయింది. ప్రాజెక్టుకు కావాల్సిన 1,389.5 హెక్టార్ల భూ సేకరణ పూర్తి అయినట్టు రైల్వే శాఖ వెల్లడించింది. అన్ని అనుమతులూ పొంది, సివిల్ కాంట్రాక్టులన్నీ నిర్మాణ సంస్థలకు అప్పగించారు.

80 నిమిషాల్లో...

గంటకు 400 కి.మీ. వేగంతో పరిగెత్తే ఈ-10 బుల్లెట్ ట్రైన్ ముంబై నుంచి సబర్మతికి మధ్య ఉన్న 508 కిలోమీటర్ల దూరాన్ని నాన్ -స్టాప్‌గా అయితే 80 నిముషాల్లో పూర్తి చేస్తుంది.

ఈ-5 కాదు.. ఈ-10 రైళ్లు

ఒప్పందంలో భాగంగా జపాన్ ప్రభుత్వం 'ఈ-5' షింకన్సెన్ బుల్లెట్ రైళ్లు మనదేశానికి పంపాలి. కానీ, ఇప్పుడు అత్యాధునికమైన 'ఈ-10' రైళ్లు ఆ దేశం తయారుచేస్తోంది. వాటినే మనకు పంపనుంది. ఇవి జపాన్ తోపాటు భారత్‌లోనూ 2030 ప్రారంభంలో ఎంట్రీ ఇవ్వనున్నాయి. 'ఈ-5' బుల్లెట్ ట్రైన్ వేగం గంటకు గరిష్ఠంగా 320 కి.మీ. కాగా, ఈ-10 రైలు వేగం 400 కి.మీ. ఈ రైళ్లను భారత్‌లోనూ తయారు చేసే అవకాశం ఉంది.





# బంగారం ధరలు మరింత పెరుగుతాయా.. నిపుణులు ఏం చెబుతున్నారంటే?

బంగారం ధరలు రోజురోజుకి అమాంతం పెరుగుతూనే ఉన్నాయి. వెండి రేటు కూడా జీవితకాల గరిష్టాలకు చేరుకుంది. ఈ రోజు (ఆగస్టు 30) 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1640 పెరిగి రూ. 1,04,950 వద్దకు చేరింది. కేజీ వెండి రూ. 1,31,000 వద్ద ఉంది. ఈ నెల ప్రారంభంతో పోలిస్తే.. ఈ ధరలు చాలా ఎక్కువ అని తెలుస్తోంది.

ఈ సంవత్సరం భారతదేశంలో బంగారం ధరలు దాదాపు 32 శాతం పెరిగాయి. ఇది పెట్టుబడిదారులకు లాభదాయకంగా ఉన్నప్పటికీ, కొనుగోలుదారులకు కొంత భారమైపోయింది. జనవరిలో పది గ్రాముల గోల్డ్ రూ. 80,000 నుంచి ప్రారంభమై.. మార్చి నాటికి రూ.90,000 చేరుకుంది. కాగా ఇప్పుడు ఈ ధరలు లక్ష రూపాయలు దాటేసింది.

గ్లోబల్ మార్కెట్లో మే 2025 ప్రారంభంలో బంగారం ధర ఔన్సుకు 3392 డాలర్ల వద్ద ఉండేది. జూన్ మధ్య నాటికి ఇది 3368 డాలర్ల వద్దకు చేరుకుంది. గోల్డ్ రేటు విపరీతంగా పెరగడానికి రాజకీయ ఉద్రిక్తతలు, బలహీనపడుతున్న యూఎస్ డాలర్ విలువ మాత్రమే కాకుండా.. రూపాయి విలువ తగ్గడం కూడా ప్రధాన కారణమైందని నిపుణులు చెబుతున్నారు.

ఇండియా బులియన్ & జ్యువెలర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అండ్ ఆస్పెక్ట్ గ్లోబల్ వెంచర్స్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ 'అక్ష కాంబోజ్' మాట్లాడుతూ.. పండుగ సీజన్‌లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. ప్రపంచ అనిశ్చితి, బలహీనపడుతున్న డాలర్ ఇండెక్స్ మధ్య పెట్టుబడిదారులు బంగారం వైపు ఆకర్షితులయ్యారు. భారత ఎగుమతులపై అమెరికా విధించిన.. 50 శాతం సుంకాలు కూడా పసిడి డిమాండును మరింత పెంచిందని అన్నారు.

ఇదీ చదవండి: 9K గోల్డ్ గురించి తెలుసా?: రేటు ఇంత తక్కువా..

బంగారం ధరలు పెరగడానికి సీజనల్ డిమాండ్ మరో కీలకమైన అంశం. ప్రపంచంలో రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు అయిన భారతదేశంలో పండుగలు.. వివాహాల సీజన్ మొదలైపోయింది. దీనివల్ల కూడా బంగారం కొనుగోళ్లు పెరుగుతాయి, ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. ధర ఎంత పెరిగినా.. బంగారంపై పెట్టుబడి ఎప్పటికి మంచి లాభాలను తెస్తుందనేది మాత్రం వాస్తవం.




# వచ్చే ఏడాది జియో ఐపీఓ

**100 కోట్ల తెరలపై జియోస్టార్!**
**కొత్త ఏఐ కంపెనీ ఏర్పాటు**
**గూగుల్, మెటాతో భాగస్వామ్యం**
**2026లో బ్యాటరీ గిగాఫ్యాక్టరీ**
**ముకేశ్ అంబానీ ప్రకటన**
**రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏజీఎమ్**

**దిల్లీ:** అందరూ ఎదురుచూస్తున్న, భారత చరిత్రలోనే అతిపెద్ద ఐపీఓగా చెబుతున్న రిలయన్స్ జియో పబ్లిక్ ఇష్యూ వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే రానుందని రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) అధిపతి ముకేశ్ అంబానీ స్పష్టం చేశారు. ఐపీఓ కోసం జియో అన్ని విధాలా సిద్ధమవుతోందన్నారు. ఇన్వెస్టర్లకు ఇది అత్యంత ఆకర్షణీయ అవకాశంగా ఉండగలదని శుక్రవారం జరిగిన ఆర్ఐఎల్ వార్షిక సమావేశంలో పేర్కొన్నారు. 2027 కల్లా ఎబిటాను 2022 నాటి రూ.1.25 లక్షల కోట్ల నుంచి రెట్టింపు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రూప్‌నకు సంబంధించిన పలు అంశాలను వాటాదార్లతో పంచుకున్నారు.

**రిలయన్స్ ఇంటలిజెన్స్ వస్తోంది**

మెటా, గూగుల్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంతో ఏఐ అనుబంధ సంస్థ 'రిలయన్స్ ఇంటలిజెన్స్'ను ఏర్పాటు చేయనున్నట్లు ముకేశ్ ప్రకటించారు. ప్రతీ ఒక్కరికీ, ప్రతీ చోటకు ఏఐని అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కంపెనీ ఏఐ రెడీ డేటా సెంటర్లను గిగావాట్ పరిమాణంలో నిర్మించనుందని తెలిపారు. భారత్‌కు తదుపరి తరం ఏఐ మౌలిక వసతులను, ఏఐ సేవలను, ఏఐ నిపుణులను అందించడమే రిలయన్స్ ఇంటలిజెన్స్ లక్ష్యాలని స్పష్టం చేశారు.

ఆర్ఐఎల్, మెటా కలిసి రూ.855 కోట్ల ప్రాథమిక పెట్టుబడులతో ఒక ఏఐ సంయుక్త సంస్థ(70:30)ను ఏర్పాటు చేయనున్నారు. ఏఐ రెడీ డేటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి గూగుల్‌తోనూ ఆర్ఐఎల్ భాగస్వామ్యం కుదుర్చుకుంది.

**10 శాతం వాటా విక్రయం**

50 కోట్లకు పైగా వినియోగదారులున్న జియోలో ఎంత మేర వాటా విక్రయం ఉంటుందన్నదనీ ముకేశ్ వెల్లడించనప్పటికీ 10% వాటా అమ్మవచ్చన్న వార్తలున్నాయి. ఆర్ఐఎల్‌కు ప్రస్తుతం జియోప్లాట్‌ఫామ్స్‌లో 66.3% వాటా ఉండగా, ఫేస్‌బుక్‌కు 10%, గూగుల్‌కు 7.7% వాటాలున్నాయి. జియో విలువ 136154 బి. డాలర్లుగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఐపీఓకు వచ్చాక ప్రపంచంలోనే అతిపెద్ద ఆరో టెలికాం కంపెనీగా మారే అవకాశం ఉంది. 2019లో తొలిసారిగా జియో ఐపీఓ గురించి ముకేశ్ ప్రస్తావించారు. 2030 కల్లా 5జీ నుంచి 6జీకి వినియోగదార్లను తీసుకెళతామన్నారు.

**2032 కల్లా 3 మి.టన్నుల హరిత హైడ్రోజన్**

స్వచ్ఛ ఇంధన వ్యాపారంలో కంపెనీ దూకుడుగా వ్యవహరించనుంది. 2026లో ఒక మెగా బ్యాటరీ గిగా ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనుంది. ఏటా 40 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం నుంచి 100 జీడబ్ల్యూహెచ్‌కు విస్తరిస్తామని ముకేశ్ అన్నారు. వచ్చే ఏడాది చివరకు ఒక ఎలక్ట్రోలైజర్ గిగా ఫ్యాక్టరీ కార్యకలాపాలూ ప్రారంభమవుతాయన్నారు. సింగపూర్ పరిమణంతో పోలిస్తే మూడింతలుండే ఒక సౌర విద్యుత్ ప్రాజెక్టునూ తీసుకురానున్నారు. 2032 కల్లా 3 మిలియన్ టన్నుల హరిత హైడ్రోజన్ సామర్థ్యాన్ని లక్ష్యంగా కంపెనీ పెట్టుకుంది. సౌర, బ్యాటరీ స్టోరేజీ, హైడ్రోజన్.. ఇలా స్వచ్ఛ ఇంధన వ్యవస్థనంతా ఒక గొడుగు కిందకు తీసుకురానున్నట్లు ముకేశ్ తెలిపారు. జామ్ నగర్‌ను 'కొత్త రిలయన్స్, సరికొత్త భారత్'కు ముఖచిత్రంగా మారుస్తామన్నారు.

**అతిపెద్ద రెండో ప్లాట్‌ఫాం**

30 కోట్ల మంది వినియోగదార్లతో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌గా జియోహాట్‌స్టార్‌గా మారింది. మొబైల్, టీవీ, కనెక్టెడ్ డివైజెస్‌లలో సేవలందిస్తున్న జియోస్టార్ 100 తెరలపై కనిపిస్తోందని ఆర్ఐఎల్ డైరెక్టర్ ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు.

**ఫుడ్‌పార్క్‌లపై రూ.40,000 కోట్లు**

భారత్‌లోనే అతిపెద్ద రిటైలర్ అయిన రిలయన్స్ రిటైల్ వచ్చే మూడేళ్లలో 20% సమ్మిళిత వృద్ధిని సాధించడంపై ధీమాగా ఉంది. 'రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్'తో ఎఫ్ఎమ్‌సీజీ వ్యాపారాన్ని వచ్చే అయిదేళ్లలో ఎనిమిదింతలు చేసి రూ.లక్ష కోట్లకు చేర్చుకోవాలని



భావిస్తోంది. అంతే కాకుండా.. ఆసియాలోనే అతిపెద్ద ఫుడ్ పార్క్‌లను సృష్టించడం కోసం రూ.40,000 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నట్లు ఆర్ఐఎల్ డైరెక్టర్ ఈశా అంబానీ తెలిపారు.

స్మార్ట్‌గ్లాసెస్ విభాగంలోకి జియో అడుగుపెట్టింది. 'జియోఫ్రేమ్స్' ద్వారా చేతులతో పనిలేకుండానే కాల్స్ చేసుకోవడం, మ్యూజిక్ ఆన్/ఆఫ్ చేసుకోవడంతో పాటు వీడియోలను రికార్డ్ చేయొచ్చు.




# ఆర్‌బీఐ కఠిన నిర్ణయం: రెండు బ్యాంకులకు జరిమానా

**'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పలు బ్యాంకులకు భారీ జరిమానాలు విధించిన ఆర్‌బీఐ.. తాజాగా బంధన్ బ్యాంక్, నాందేడ్ డిస్ట్రిక్ట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌కు జరిమానా విధించింది.**

ఆదేశాలను పాటించలేకపోవడం వల్ల బంధన్ బ్యాంక్‌కు రూ. 44.7 లక్షల జరిమానా విధించడం జరిగిందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ముఖ్యంగా కొంత మంది ఉద్యోగుల వేతనాలను కమిషన్ రూపంలో చెల్లించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. అంతే కాకుండా.. బ్యాంక్ కొన్ని ఖాతాల డేటాకు సంబంధించి బ్యాక్ ఎండ్ ద్వారా మాన్యువల్ జోక్యాన్ని నిర్వహించిందని.. సిస్టమ్‌లోని నిర్దిష్ట వినియోగదారు వివరాలతో యాక్సెస్ ఆడిట్ ట్రయల్స్/లాగ్‌లను సంగ్రహించలేదని తెలిపింది.

మహారాష్ట్ర కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న 'నాందేడ్ డిస్ట్రిక్ట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్'కు ఆర్‌బీఐ రూ. 45వేలు జరిమానా విధించింది. కేవైసీ నిబంధనలను పాటించకపోవడం, అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేటువంటి సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేయకపోవడం వంటి కారణాల వల్ల ఈ ఫైన్ విధించినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. బ్యాంకులపై జరిమానాలు విధించినప్పటికీ, ఈ ప్రభావం కస్టమర్ల మీద ఉండదు. అయితే బ్యాంకు కార్యకలాపాలపై ఆంక్షలు విధించినప్పుడు లేదా లైసెన్స్ రద్దు చేసినప్పుడు కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కాబట్టి కస్టమర్లు.. నిలక్ష్యంగా వ్యవహరించే బ్యాంకులకు కొంత దూరంగా ఉండాలి

# ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారా.. ఈ పత్రాలు సిద్ధం చేసుకోండి

**ఇంటర్నెట్ డెస్క్:** గత ఆర్థిక సంవత్సరానికి (2024-25) సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నుల ఫైలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. సెప్టెంబరు 15 వరకు గడువు ఉంది. ఇప్పటికే 3 కోట్ల మందికి పైగా తమ రిటర్నులు ఫైల్ చేశారు. ఇంకా సగం మందికి పైగా రిటర్నులు ఫైల్ చేయాల్సిఉంది. చివరి నిమిషంలో ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు అన్ని పత్రాలూ చేతిలో ఉండేలా చూసుకోవాలి. లేదంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఫైలింగ్ ప్రక్రియ ఆలస్యం అవడమే కాకుండా.. తప్పులకు ఆస్కారం ఏర్పడుతుంది. కాబట్టి పన్ను రిటర్నులు దాఖలు చేసేందుకు సిద్ధం చేసుకోవాల్సిన డాక్యుమెంట్లు ఏంటో తెలుసుకుందాం.




**ఫారం 16..**

ఉద్యోగులు రిటర్నులు దాఖలు చేసేందుకు అవసరమైన కీలకమైన పత్రాల్లో ఫారం16 ఒకటి. దీన్ని కంపెనీ యాజమాన్యం జారీ చేస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న వేతనం, అలవెన్సులు, సమర్పించిన మినహాయింపులు, మూలం వద్ద పన్ను విధింపు (టీడీఎస్) లాంటి వివరాలు ఇందులో ఉంటాయి.

**క్యాపిటల్ గెయిన్ స్టేట్‌మెంట్**

సంబంధిత ఆర్థిక సంవత్సరంలో మ్యూచువల్ ఫండ్లు, షేర్లు, ఇతర ఆస్తులను విక్రయించినట్లయితే.. మూలధన రాబడిని ఐటీ రిటర్నుల్లో తెలియజేయాలి. స్టాక్ బ్రోకర్ లేదా మ్యూచువల్ ఫండ్ హౌస్ నుంచి క్యాపిటల్ గెయిన్ స్టేట్‌మెంట్ తీసుకోవాలి. పన్ను గణ[illegible]కు ఇది ముఖ్యం.

**ఫారం-26ఏఎస్, ఏఐఎస్**

ఫారం 26ఏఎస్ ఐటీఆర్ ఫైలింగ్‌లో మరో కీలక డాక్యుమెంట్. ఒక వ్యక్తికి వచ్చిన వివిధ ఆదాయాలు, మూలం వద్ద పన్ను కోత (TDS) వివరాలతో ఫారం26ఏఎస్ ఉంటుంది. ఏఐఎస్‌లో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విస్తృతమైన సమాచారం ఉంటుంది. వీటిని ఇఫైలింగ్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**వడ్డీ సర్టిఫికెట్లు, బ్యాంకు స్టేట్‌మెంట్లు**

బ్యాంకులు, పోస్టాఫీసులు లేదా ఇతర వాటిలో డిపాజిట్లపై వచ్చిన వడ్డీ ఆదాయాన్ని తెలియజేసేందుకు.. 202425 ఆర్థిక సంవత్సరానికి వడ్డీ సర్టిఫికెట్‌లను తీసుకోవాలి. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్‌లను చేతిలో ఉంచుకోవడం కూడా మంచిది.

**పన్ను ఆదా పెట్టుబడులు..**

పాత పన్ను విధానం కింద రిటర్నులు దాఖలు చేయాలనుకుంటే.. పన్ను ఆదా కోసం వివిధ పెట్టుబడులు, ఖర్చులకు ఆధారాలు చూపాల్సిన అవసరం ఉంది. దీనికోసం అన్ని రసీదులు, పత్రాలను మీ వద్ద పెట్టుకోవాలి. 80సీ, 80సీసీడీ (1బీ), 80డీ, 80డీడీ, 80టీటీఏ వంటి సెక్షన్ల కింద మినహాయింపును క్లెయిమ్ చేసేటప్పుడు ఆయా పత్రాలు అవసరం అవుతాయి.

**విదేశీ ఆదాయం**

విదేశీ ఆస్తులు లేదా విదేశీ వనరుల నుంచి ఆదాయం పొందుతున్నవారు తమ ఐటీఆర్‌లో వాటిని ప్రస్తావించాలి. రిటర్నుల ఫైలింగ్‌లో తప్పులు నివారించేందుకు విదేశీ ఆదాయం, అన్‌లిస్టెడ్ షేర్లకు సంబంధించిన పత్రాలను సిద్ధంగా ఉంచుకోండి.

**పాన్, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు**

పాన్ కార్డు, ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలను అందుబాటులో ఉంచుకోవాలి. పన్ను రీఫండ్ కోసం అకౌంట్ నంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వంటి వివరాలు అవసరం. ఈ పత్రాలను సిద్ధంగా ఉంచుకుంటే ఐటీఆర్ ఫైలింగ్‌ను అంతరాయాలు లేకుండా పూర్తి చేయొచ్చు.







# లాంచ్‌కు సిద్ధమవుతున్న వియాత్నం బ్రాండ్ కార్లు.. ఇవే

వియాత్నం కంపెనీ విన్‌ఫాస్ట్.. భారతదేశంలో తన VF6, VF7 ఎలక్ట్రిక్ కార్లను 2025 సెప్టెంబర్ 6న ప్రారంభించనున్నట్లు ధృవీకరించింది. 2025 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో కనిపించిన ఈ కార్లు త్వరలోనే రోడ్డుపై కనిపించనున్నాయి. కాగా కంపెనీ ఈ కార్ల కోసం ప్రీబుకింగ్‌లను జులై 15 నుంచి స్వీకరించనున్నట్లు సమాచారం. వినియోగదారులు రూ. 21,000 రీఫండబుల్ డిపాజిట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా విన్‌ఫాస్ట్ అవుట్‌లెట్‌లలో బుక్ చేసుకోవచ్చు. డెలివరీలు త్వరలో ప్రారంభమవుతాయి.

ప్రీమియం ఎలక్ట్రిక్ మొబిలిటీని కోరుకునే భారతీయ కొనుగోలుదారులను.. లక్ష్యంగా చేసుకుని విన్‌ఫాస్ట్ VF6 & VF7 లాంచ్ చేయడానికి సిద్ధమైంది. ఈ కార్లు లెవెల్ 2 ఏడీఏఎస్ ఫీచర్స్ కలిగి ఉంటాయని, పనోరమిక్ గ్లాస్ రూఫ్‌లను కూడా పొందుతాయని కంపెనీ వెల్లడించింది.

విన్‌ఫాస్ట్ తన సేల్స్, సర్వీస్, స్పేర్స్ నెట్‌వర్క్‌ను విస్తరించడంతో భాగంగా.. ఢిల్లీ, బెంగళూరు, పూణే, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై వంటి ప్రధాన కేంద్రాలతో సహా 27 నగరాల్లో 32 షోరూమ్‌లను ఏర్పాటు చేయడానికి 13 డీలర్లతో భాగస్వామ్యం కలిగి ఉంది. అంతే కాకుండా ఛార్జింగ్ స్టేషన్స్ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి.. కంపెనీ రోడ్‌గ్రిడ్, మైటీవీఎస్, గ్లోబల్ అష్యూర్‌లతో కూడా ఒప్పందం కుదుర్చుకుంది.

# బీఎస్‌ఎన్ఎల్ పే యూపీఐ వచ్చేస్తుంది!

**ప్రభుత్వం టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఆన్‌లైన్ సేవల్లో ప్రైవేటు కంపెనీలతో పోటీ పడుతోంది. ప్రిపెయిడ్, పోస్ట్ పెయిడ్, డేటా ప్లాన్లతో ప్రైవేటు సంస్థలకు దీటుగా దూసుకెళుతున్న బీఎస్ఎన్ఎల్ (BSNL) మరో ముందడుగు వేయబోతోంది. వినియోగదారుల కోసం త్వరలో కోసం కొత్త సర్వీసును అందుబాటులోకి తెచ్చేందుకు సన్నద్ధమవుతోంది.**

**స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఆర్థిక లావేదేవీలు, బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం లాంటి ప్రైవేటు డిజిటల్ యాప్‌లను ఎక్కువగా**




**వాడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ కూడా త్వరలోనే యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను ప్రారంభించనుంది. బీఎస్ఎన్ఎల్ పే పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ (భీమ్) యూపీఐ ఆధారంగా బీఎస్ఎన్ఎల్ పే ) సేవలను వినియోగించుకునేలా దీన్ని రూపొందిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.**

**దీపావళి నాటికి ప్రారంభం!**

**బీఎస్ఎన్ఎల్ పే సేవలు వినియోగదారులకు దీపావళి నాటికి అందుబాటులోకి వస్తాయని మీడియాలో వార్తలు వస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ పే అనేది ప్రత్యేకమైన యాప్ కాదు. బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్‌లో భాగంగానే ఇది ఉంటుంది. భీమ్ యూపీఐ ద్వారా దీని సేవలను యూజర్లు వినియోగించుకోవచ్చు.**

**ఎలాంటి సేవలు అందిస్తుంది?**

**ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం మాదిరిగానే బీఎస్ఎన్ఎల్ పే ద్వారా అన్ని రకాల ఆన్‌లైన్ చెల్లింపులు చేయగలుగుతారు. సెల్ఫ్ కేర్ యాప్ వినియోగదారులు సులువుగా ఈ సేవలు ఉపయోగించుకోవచ్చు. యూజర్లకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందించడంతో పాటు, దేశంలో వేగంగా విస్తరిస్తున్న యూపీఐ చెల్లింపుల మార్కెట్‌లో తమ దైన ముద్ర వేయాలని బీఎస్ఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ పే సేవలు అందుబాటులోకి వస్తే ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం లాంటి ప్రైవేటు డిజిటల్ యాప్‌లకు గట్టి పోటీ ఎదురవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.**



# అక్షయ్‌కుమార్ సైఫ్ మూవీలో హీరోయిన్‌గా.. ఎవరీ సయామీ ఖేర్?



**ఇంటర్నెట్ డెస్క్:** దాదాపు 17 ఏళ్ల తర్వాత బాలీవుడ్ స్టార్ హీరోలు అక్షయ్‌కుమార్  సైఫ్ అలీఖాన్ మళ్లీ కలిసి నటిస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటిస్తారా? అన్న ప్రశ్నకు సమాధానం వచ్చింది. ఈ మూవీలో సయామీ ఖేర్ ) ఛాన్స్ దక్కించుకుంది. ''ఎవరి సినిమాలు చూస్తూ పెరిగానో.. ఇప్పుడు వారితోనే కలిసి నటిస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఇది నేను ఊహించనిది'' అని అంటోన్న సయామీ ఖేర్ గురించి కొన్ని విశేషాలివీ..

**టాలీవుడ్‌తో మొదలైన నట ప్రయాణం..**

నాసిక్‌కు చెందిన సయామీ తెలుగు సినిమాతోనే నటిగా పరిచయమైంది. ఆమె నటించిన తొలి చిత్రం 'రేయ్'. 'వైల్డ్‌డాగ్', 'హైవే' సినిమాల్లో కీలక పాత్రలతో తెలుగు ఆడియన్స్‌కు మరింత చేరువైంది. కొన్నాళ్లుగా బాలీవుడ్‌లోనే బిజీగా ఉంటోంది. 'ఘూమర్' సినిమాలో క్రికెటర్ కావాలనే తన కలను నెరవేర్చుకునే దివ్యాంగురాలిగా నటించి, స్ఫూర్తినిచ్చింది. ఉత్తమ నటిగా 'ఐకానిక్ గోల్డ్ అవార్డు' అందుకుంది. కొన్ని నెలల క్రితం విడుదలైన 'జాట్'లో పోలీస్ ఆఫీసర్‌గా అదరగొట్టింది. ఇలా.. సుమారు పదేళ్ల కెరీర్‌లో తక్కువ సినిమాలే చేసినా తనదైన ముద్ర వేసింది. ఫిట్‌నెస్‌కు అధిక ప్రాధాన్యమిచ్చే సయామీ 'రా' ఏజెంట్ పాత్రలకు పెట్టింది పేరు. 'వైల్డ్‌డాగ్' సినిమా, 'స్పెషల్ ఓపీఎస్' వెబ్‌సిరీస్‌లు అందుకు నిదర్శనం.

**సినీ నేపథ్య కుటుంబం..**

తండ్రి అద్వైత్ ఖేర్ అప్పట్లో మోడల్. తల్లి ఉత్తర.. 80ల్లో అందాల కిరీటం దక్కించుకుంది. చెల్లి సంస్కృతి ఖేర్. మరాఠీ చిత్రాల్లో నటిస్తోంది. దివంగత నటి ఉషాకిరణ్ మనవరాలే ఈ సయామీ. నటి తన్వీ అజ్మీకి మేనకోడలు. సినీ నేపథ్య కుటుంబం కావడంతో డిగ్రీ పూర్తయ్యాక సయామీ రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టింది.

**ఆటల్లోనూ మేటి..**

ఈ బ్యూటీ ఆటల్లోనూ మేటి అనిపించుకుంది. ట్రయథ్లాన్ పోటీల్లో చురుకుగా పాల్గొనే ఆమె.. ఏడాది వ్యవధిలో రెండు సార్లు 'ఐరన్‌మ్యాన్ 70.3' ట్రయథ్లాన్‌ను పూర్తి చేసిన తొలి భారతీయ నటిగా రికార్డు నెలకొల్పింది. 'ఐరన్‌మ్యాన్ 70.3'.. ఈ పోటీని 'హాఫ్ ఐరన్‌మ్యాన్'గానూ పిలుస్తారు. ఈ ప్రఖ్యాత రేసును 'ప్రపంచ ట్రయథ్లాన్ కార్పొరేషన్' నిర్వహిస్తుంటుంది. ఇందులో భాగంగా ఈత  (1.9 కి.మీ), సైక్లింగ్ (90 కి.మీ), పరుగు (21.1 కి.మీ).. ఈ మూడు క్రీడల్లో వరుసగా పాల్గొనాల్సి ఉంటుంది.



# SSMB29 షూటింగ్ ఫొటోలు.. ప్రియాంక చోప్రా పోస్ట్

స్టార్ డైరెక్టర్ రాజమౌళి.. ప్రస్తుతం మహేశ్ బాబుతో సినిమా చేస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్ ఉందని అందరికీ తెలుసు. కానీ రాజమౌళి ఒక్కటంటే ఒక్క మాట బయటపడకుండా జాగ్రత్త పడుతున్నాడు. అటు మహేశ్ బాబు కూడా పిన్ డ్రాప్ సైలెంట్ అనేలానే ఉన్నాడు. మిగతా టీమ్ అంతా కూడా ఒక్క ఫొటో కూడా పోస్ట్ చేయట్లేదు. కానీ హీరోయిన్ మాత్రం అస్సలు తగ్గట్లేదు. ఫొటోలు పోస్ట్ చేస్తూనే ఉంది. తాజాగా ఇన్ స్టాలో పోస్ట్ పెట్టింది.

రాజమౌళి-మహేశ్ బాబు సినిమాకు 'SSMB29' అనే వర్కింగ్ టైటిల్ నిర్ణయించారు. ఇందులో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా చేస్తోంది. షూటింగ్ జరిగిన ప్రతిసారి ఆ ప్రాంత ఫొటోలని ఈమె పోస్ట్ చేస్తూనే ఉంది. కొన్ని నెలల క్రితం ఒడిశాలో షూటింగ్ జరగ్గా.. అప్పుడు కూడా ఆయా ప్రాంతంలో తీసుకున్న కొన్ని ఫొటోల్ని ప్రియాంక పోస్ట్ చేసింది. ఇప్పుడు టీమ్ అంతా కెన్యాలో చిత్రీకరణ చేస్తోంది. అక్కడ పర్యావరణ అందాల్ని తన కెమెరాలో బంధించిన ఈ బ్యూటీ.. పలు ఫొటోల్ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీంతో మహేశ్ ఫ్యాన్స్‌కి షూటింగ్ అప్డేట్ ఇచ్చినట్లయింది.

చాలా ఏళ్ల క్రితమే రాజమౌళి.. కెన్యా వెళ్లి వచ్చాడు. అప్పడు లొకేషన్ల కోసం కాగా ఇప్పడు షూటింగ్ జరుగుతోంది. అయితే ఆగస్టు 9న మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఏదైనా లుక్, పోస్టర్ లాంటిది వస్తుందని అభిమానులు ఆశపడ్డారు. కానీ నవంబర్‌లోనే అఫీషియల్ పోస్టర్ వస్తుందనే అప్‌డేట్ లాంటిది ఆ రోజున ప్రకటించారు. ఇప్పడు కెన్యాలో ఎలాంటి సౌండ్ లేకుండా షూటింగ్ చేసుకుంటున్నారు. గత చిత్రాలతో పోలిస్తే రాజమౌళి ఈసారి భిన్నంగా ప్రవర్తిస్తుండటం విశేషం.

ఇకపోతే ఈ మూవీ గ్లోబ్ ట్రాటెర్ కాన్సెప్ట్ అని చాన్నాళ్ల క్రితమే చెప్పారు. అంటే ఈ స్టోరీలో హీరో ప్రపంచమంతా తిరుగుతుంటాడు. అడ్వెంచర్స్ చేస్తుంటాడు. మహేశ్ బాబుకి విలన్‌గా 'సలార్' ఫేమ్ పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నాడు. ఈ విషయం కూడా చాన్నాళ్ల క్రితం లీకైన ఓ వీడియో వల్ల బయటపడింది.



## ఆ సినిమా నేను చేయాల్సింది.. కానీ బన్నీ

ఇండస్ట్రీలో అప్పుడప్పుడు ఒకరు చేయాల్సిన సినిమాలు మరో హీరోకు వెళ్లడం పరిపాటే. రీసెంట్ టైంలోనూ అలాంటిదే జరిగింది. లెక్క ప్రకారం త్రివిక్రమ్‌అల్లు అర్జున్ కలిసి ఓ ప్రాజెక్ట్ చేయాల్సి ఉంది. కానీ కారణాలేంటో తెలీదు గానీ అది క్యాన్సిల్ అయింది. ప్రాజెక్టులోకి ఎన్టీఆర్ వచ్చి చేరాడు. సరే ఈ సంగతి పక్కనబెడితే తమిళ యంగ్ హీరో ఓ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టాడు. తాను చేయాల్సిన ఓ మూవీలో బన్నీ నటించాడని చెప్పుకొచ్చాడు.

తెలుగు సినిమాల్లో తండ్రి క్యారెక్టర్స్ చేసే ప్రభు గుర్తున్నారుగా.. ఆయన కొడుకు విక్రమ్ ప్రభు తమిళంలో హీరోగా చాన్నాళ్ల నుంచి సినిమాలు చేస్తున్నాడు. 'గజరాజు'తో పాటు ఒకటి రెండు చిత్రాలు డబ్ చేసి రిలీజ్ అయ్యాయి. కానీ ఏమంత గుర్తింపు రాలేదు. ఇతడు తొలిసారి తెలుగులో చేసిన మూవీ 'ఘాటీ'. అనుష్క లీడ్ రోల్ చేసిన ఈ సినిమాలో.. ఆమె సరసన విక్రమ్ ప్రభు నటించాడు. సెప్టెంబరు 5న మూవీ థియేటర్లలోకి రానుంది. ప్రస్తుతం ప్రమోషన్స్ సాగుతున్నాయి.

తాజాగా ఓ తమిళ ఇంటర్వ్యూలో విక్రమ్ ప్రభు మాట్లాడుతూ.. దాదాపు పదేళ్ల క్రితం నాటి సంగతి బయటపెట్టాడు. 'అనుష్కతో గతంలోనే నేను సినిమా చేయాలి. 'రుద్రమదేవి'లో గోన గన్నారెడ్డి పాత్ర కోసం దర్శకుడు గుణశేఖర్ తొలుత నా దగ్గరికి వచ్చారు. మూడు నెలలు డేట్స్ కావాలని అడిగారు. కానీ నేను అప్పుడు వేరే చిత్రాలతో బిజీగా ఉండటంతో చేయలేకపోయాను. కానీ బన్నీ ఆ పాత్రకు పూర్తి న్యాయం చేశాడు' అని చెప్పుకొచ్చాడు. ఇప్పుడు ఈ వీడియో వైరల్ అవుతోంది.

'రుద్రమదేవి'లో గోన గన్నారెడ్డిది అతిథి పాత్ర. కానీ అల్లు అర్జున్ చేయడంతో అప్పట్లో కాస్త క్రేజ్ వచ్చింది. మూవీ మోస్తరుగా ఆడినా సరే ఈ రోల్ బన్నీకి మంచి గుర్తింపు తీసుకొచ్చింది. తెలంగాణ స్లాంగ్‌లో 'మీ అభిమానం సల్లగుండా' అంటూ చెప్పిన డైలాగ్స్ ఇప్పటికీ ఫేమస్. అల్లు అర్జున్ చేయడం వల్ల ఇంత క్రేజీ వచ్చింది. ఒకవేళ ఇదే పాత్ర విక్రమ్ ప్రభు చేసుంటే ఎలా ఉండేదో మరి?



# వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'.. అరుదైన గౌరవం అందుకున్న బాలకృష్ణ

హైదరాబాద్: ప్రముఖ నటుడు బాలకృష్ణ కు అరుదైన గౌరవం దక్కింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (గోల్డ్ ఎడిషన్)లో ఆయన పేరు చేరింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ పురస్కారానికి ఎంపికైన తొలి నటుడిగా బాలయ్యబాబు నిలిచారు. ఆయన సినీ కెరీర్‌కు 50 ఏళ్లు పూర్తయిన సంగతి తెలిసిందే. ఇప్పటికీ హీరోగా కొనసాగుతుండడం విశేషం. ఈ మేరకు ఆయన అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన వేడుకలో బాలకృష్ణ ఈ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్, ఏపీ మంత్రి నారాలోకేశ్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. "తెలుగు రాష్ట్రాల్లో వర్షా ల వల్ల ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. రైతులు దిక్కు తోచని పరిస్థితుల్లో ఉన్నారు. వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా. ఇక, నాకు ఈ ధన్యమైన జన్మనిచ్చిన నా గురువు, దైవం విశ్వ విఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు గారికి, తల్లి బసవ రామ తారకంగారికి నా ఘనమైన నివాళులర్పిస్తున్నా. నాది చాలా పెద్ద కుటుంబం. నాన్న నుంచి వారసత్వంగా వచ్చింది. నా తల్లిదండ్రుల తర్వాత నా అభిమానులు, సినీ దర్శక, నిర్మాతలే నాకు ఎంతో స్ఫూర్తినిచ్చారు. నా మనవళ్లు కూడా నన్ను 'బాలా' అని పిలుస్తారు. అందరికీ నేను రుణపడి ఉన్నాను. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఫిల్మ్ ఇండస్ట్రీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అక్కడ అద్భుతమైన లొకేషన్స్ ఉన్నాయి. ఉద్యోగ కల్పన చేయాల్సి ఉంది. కళకు భాష, ప్రాంతీయ భేదం లేదు. ఇప్పడు తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి వెళ్లింది. మన సత్తా ఏంటో సినిమా రంగం ద్వారా చూపించుకోగలుగుతున్నాం. మనమంతా గర్వించే సమయమిది" అని బాలకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా తనకు అరుదైన గౌరవం అందించిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి ధన్యవాదాలు తెలిపారు.

రజనీ నోటి వెంట బాలకృష్ణ మూవీ డైలాగ్.. స్పెషల్ సందేశం..

ఒక చరిత్ర రాయాలన్నా, దాన్ని తిరిగి రాయాలన్నా ఒక్క బాలయ్య బాబుతోనే సాధ్యమని ఏపీ మంత్రి లోకేశ్ అన్నారు. అందరికీ బాలయ్య బాబు అయితే, తనకు ముద్దుల మావయ్య అని పేర్కొన్నారు. 50ఏళ్లు సినిమా రంగంలో.. అదే విధంగా రాజకీయాల్లోనూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వ్యక్తి అని కొనియాడారు. "బాలయ్య బాబు ఎప్పడూ యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గానే ఉంటారు. 110 సినిమాలు చేశారు. ఒక మూవీ ఏకంగా 1000 రోజులు ఆడింది. తన కెరీర్‌లో ఎన్నో జానర్స్‌లో మూవీస్ చేశారు. చారిత్రక, జానపద, ఆధ్యాత్మిక, సైన్ ఫిక్షన్ ఏదైనా సరే బాలయ్య న్యాయం చేస్తారు. నా పాదయాత్రలో బాలకృష్ణ సినిమా సంభాషణలు చాలా వాడాను. బాలయ్య బాబు భోళాశంకరుడు, అందుకే సినీ పరిశ్రమ ఆయన్ని అమితంగా ప్రేమిస్తుంది. బాలయ్య సినీ ప్రస్థానం ఎన్నో ఒడుదొడుకులతో కూడుకున్నది. బాలకృష్ణలోని మానవత్వానికి నిదర్శనం బసవతారకం ఆస్పత్రి. బాలకృష్ణలాంటి మరో వ్యక్తి సినీ పరిశ్రమలో లేరు. ఓటీటీలోనూ ఆయన అద్భుతంగా రాణించారు. నిజంగానే ఆయన అన్ స్టాపబుల్. బాలకృష్ణకు వరల్డ్ బుక్ ఆఫ్ రివార్డు దక్కడం తెలుగు జాతికి గర్వకారణం" అని మంత్రి లోకేశ్ అన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ బాలకృష్ణకు శుభాకాంక్షలు చెప్పారు. ఆయనకు ఈ గౌరవం దక్కడం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు. "బాలకృష్ణ వయసు 65. కానీ, ఆయన్ను చూస్తే 25ఏళ్ల వ్యక్తిలా కనిపిస్తారు. ఆయనలో బోళాతనం, గంభీరత్వం, నచ్చిందే చేసే గుణం, నచ్చకపోతే రుద్రతాండవం. తాను చెప్పాలనుకున్న విషయాన్ని ముక్కు సూటిగా చెప్పే వ్యక్తి బాలకృష్ణ. సినీ చరిత్రలో 50 ఏళ్లు హీరోగా ఉండటం గొప్ప విషయం. బాలకృష్ణ డాక్టర్ కావాల్సిన వ్యక్తి యాక్టర్ అయ్యారు. అనేక మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. బాలకృష్ణ మంచి హీరో అవుతారని భానుమతి ఏ మూహుర్తాన అన్నారో అది నిజమైంది. ఎన్టీఆర్ జీవిత కథను అద్భుతంగా ఆవిష్కరించిన వ్యక్తి బాలకృష్ణ. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు. ఆవేశం, ఆక్రోశం, ఆనందం వచ్చినా జై బాలయ్య అంటే సరిపోతుంది. మరో 35 ఏళ్లు మరింత జోష్‌తో బాలకృష్ణ రాణించాలి" అని బండి సంజయ్ ఆకాంక్షించారు.



## అల్లు అరవింద్‌కు మాతృ వియోగం

**ఇంటర్నెట్ డెస్క్:** అల్లు అరవింద్  ఇంట విషాదం నెలకొంది. ఆయన తల్లి, దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ (94) కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతోన్న ఆమె శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. మధ్యాహ్నం కోకాపేటలో కనకరత్నమ్మ అంత్యక్రియలు జరగనున్నాయి.

ఇప్పటికే చిరంజీవి కుటుంబం అల్లు అరవింద్ ఇంటికి చేరుకున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్, అల్లు అర్జున్‌లు షూటింగ్ నిమిత్తం మైసూర్, ముంబయిలో ఉన్నారు. మధ్యాహ్నం వారు హైదరాబాద్ చేరుకోనున్నట్లు సమాచారం. కనకరత్నమ్మ మరణవార్త తెలుసుకున్న సినీ ప్రముఖులు ఆమె పార్థివదేహానికి నివాళులు అర్పించేందుకు అల్లు అరవింద్ ఇంటికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.

**"మా అత్తయ్య.. దివంగత అల్లు రామలింగయ్య భార్య కనకరత్నమ్మ శివైక్యం చెందడం ఎంతో బాధాకరం. మా కుటుంబాలపై ఆమె చూపిన ప్రేమ, ధైర్యం, జీవిత విలువలు ఎప్పటికీ మాకు ఆదర్శం. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను". - చిరంజీవి**

**"దివంగత అల్లు రామలింగయ్య సతీమణి కనకరత్నమ్మ కన్నుమూశారని తెలిసి చింతిస్తున్నాను. చెన్నైలో ఉన్నప్పటినుంచి ఎంతో ఆప్యాయత చూపేవారు. చుట్టూఉన్నవారిపై అమితమైన ప్రేమాభిమానాలు చూపేలా తన కుమార్తె సురేఖను తీర్చిదిద్దారు. కనకరత్నమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అల్లు అరవింద్‌కు, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" - పవన్ కల్యాణ్**



# అద్భుత సెంచరీలు చేసిన అంకిత్ కుమార్, యశ్ ధుల్..

**ఇంటర్నెట్ డెస్క్: దులీప్ ట్రోఫీలో ( భాగంగా నార్త్‌జోన్, సౌత్‌జోన్‌కు మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది. ఇందులో రెండో ఇన్నింగ్స్‌లో నార్త్‌జోన్ కెప్టెన్ అంకిత్ కుమార్ (264 బంతుల్లో 168*), యశ్ ధుల్ (157 బంతుల్లో 133) అద్భుత సెంచరీలు నమోదు చేశారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి నార్త్ జోన్ రెండు వికెట్ల నష్టానికి 388 పరుగులు చేసి పటిష్ఠ స్థితిలో ఉంది. దీంతో సెమీఫైనల్‌కు వెళ్లే అవకాశాలు నార్త్‌జోన్‌కు మెరుగయ్యాయి. రెండో వికెట్‌కు అంకిత్, ధుల్ 290 బంతుల్లో 240 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ధుల్ దూకుడుగా ఆడితే, పరిస్థితులకు అనుగుణంగా అంకిత్ బ్యాటింగ్ చేసి నాటౌట్‌గా నిలిచాడు.**

ఓపెనర్ శుభమ్ ఖజురియా (41 బంతుల్లో 21)ను సూరజ్ జైస్వాల్ త్వరగానే ఔట్ చేశాడు. అయితే ఆ తర్వాత అంకిత్, ధుల్ క్రీజులో పాతుకుపోయారు. వీరిపై బౌలర్లు ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారు. అయితే టీమ్ఇండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ మధ్య మధ్యలో బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. కానీ వారిపై పై చేయి మాత్రం సాధించలేకపోయాడు.

**'బ్రాంకో'కు క్రికెటర్లు ఓకే.. మరి ఫెయిల్ అయితే పరిస్థితేంటి?**

ధుల్ ఔటైన తర్వాత వచ్చిన ఆయుష్ బదోనీ కూడా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. అతడు 78 బంతుల్లో 56 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ మాత్రమే తీసుకున్న షమీ.. రెండో ఇన్నింగ్స్‌లో ఇప్పటి వరకు ఖాతా తెరవలేదు. 11 ఓవర్లు సంధించిన అతడు 36 పరుగులు ఇచ్చాడు. సూరజ్ సింధు జైస్వాల్, రియాన్ పరాగ్ తలో వికెట్ తీసుకున్నారు.

దులీప్ ట్రోఫీలో భాగంగా జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్‌లో సెంట్రల్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. రెండో ఇన్నింగ్స్‌లో సెంట్రల్ జోన్ 6 వికెట్ల నష్టానికి 331 పరుగులు చేసింది. శుభమ్ శర్మ సెంచరీతో (215 బంతుల్లో 122 పరుగులు) ఆకట్టుకున్నాడు. రజత్ పాటిదార్ (72 బంతుల్లో 66), యశ్ రాథోడ్ (83 బంతుల్లో 78) రాణించారు. నార్త్ ఈస్ట్ జోన్ బౌలర్లలో ఆకాశ్ చౌదరీ, బిశ్వర్జిత్ సింగ్ కొంతౌజం తలో రెండు వికెట్లు, జోతిన్ ఫెరోయిజామ్, అంకుర్ మాలిక్ తలో వికెట్ తీసుకున్నారు.



## ధోనీకి బీసీసీఐ స్పెషల్ ఆఫర్..! గంభీర్ అంగీకరిస్తాడా?

ఎంఎస్ ధోనీ భారత్‌కు రెండు ప్రపంచ కప్‌లు, ఛాంపియన్స్ ట్రోఫీ అందించిన సారథి. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపాడు. ఇప్పటికీ తన మాయాజాలంతో అభిమానులను ఆకట్టుకుంటున్నాడు. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ ప్రస్తుతం ఐపీఎల్‌లోనే ఆడుతోన్న విషయం తెలిసిందే. వచ్చే ఎడిషన్‌లో బరిలోకి దిగుతాడా? లేదా? అనేది ఇంకా తెలియరాలేదు. ఈ క్రమంలో ధోనీకి భారత క్రికెట్ బోర్డు స్పెషల్‌గా ఓ ఆఫర్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి.

**ఆర్సీబీ 'కేర్స్' మొదలైంది.. ఒక్కో ఫ్యామిలీకి రూ.25 లక్షలు**

2021 టీ20 ప్రపంచకప్ సమయంలో ధోనీని బీసీసీఐ మెంటార్‌గా నియమించుకుంది. కేవలం ఆ టోర్నీ వరకే సేవలు అందించేలా ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత ధోనీకి ఎలాంటి బాధ్యతలు ఇవ్వలేదు. ఈసారి మాత్రం అలా షార్ట్‌టర్మ్ కాకుండా.. భవిష్యత్తును దృష్టిలోఉంచుకొని అతడి చురుకైన వ్యూహాలను సుదీర్ఘంగా వాడుకోవాలని భావిస్తున్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. అందుకే, మరోసారి మెంటార్‌గా ధోనీని నియమించుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం. మరి మాజీ కెప్టెన్ అందుకు అంగీకరిస్తాడా? లేదా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

**ప్రధాన కోచ్ ఏమంటాడో?**

ప్రస్తుతం టీమ్ఇండియా ప్రధాన కోచ్‌గా గౌతమ్ గంభీర్ ఉన్నాడు. మెంటార్‌గా ధోనీ విషయంలో అతడు సానుకూలంగా ఉండకపోవచ్చని క్రికెట్ విశ్లేషకుల అంచనా. ధోనీ నాయకత్వంలో గెలిచిన వన్డే, టీ20 ప్రపంచకప్ జట్లలో గంభీర్ కూడా సభ్యుడే. అప్పుడు క్రెడిట్ అంతా సారథిగా ధోనీకి ఇవ్వడం సరికాదంటూ ఆ తర్వాత చాలా సందర్భాల్లో గంభీర్ వ్యాఖ్యానించాడు. జట్టు కలసికట్టుగా ఆడితేనే విజయాలు వరిస్తాయని చెప్పే గంభీర్.. ధోనీ వంటి దిగ్గజ క్రికెటర్‌ను తనకంటే కాస్త పైపదవిలో ఉంచేందుకు ఇష్టపడతాడా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇటీవల వీరిద్దరూ కలిసి ఓ కార్యక్రమంలో ఉన్న వీడియోలు వైరల్‌గా మారాయి. అందులో ఇద్దరూ సరదాగానే సంభాషించుకోవడం గమనార్హం.

## ప్రిక్వార్టర్స్‌లో రిబకినా



**న్యూయార్క్:** టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కరాస్ యుఎస్ ఓపెన్లో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం పురుషుల సింగిల్స్ మూడో రౌండ్లో అతడు 62, 64, 60తో లూసియానో (ఇటలీ)ను ఓడించాడు. ఏడుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన అల్కరాస్ తేలిగ్గా విజయాన్ని అందుకున్నాడు. ఈ క్రమంలో 9 ఏస్‌లతో పాటు 31 విన్నర్లు కొట్టాడు. లెహెకా (చెక్) కూడా ముందంజ వేశాడు. మూడో రౌండ్లో 64, 64, 64తో కాలింగ్‌నాన్ (బెల్జియం)పై నెగ్గాడు. టాప్‌సీడ్ యానిక్ సినర్ (ఇటలీ) మూడో రౌండ్లోకి ప్రవేశించాడు. అతడు 63, 62, 62తో పాపిరిన్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. ఈ పోరులో సినర్ 26 విన్నర్లు, 6 ఏస్‌లు కొట్టాడు. మూడో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), ఎనిమిదో సీడ్ డిమెనార్ (ఆస్ట్రేలియా), పదో సీడ్ ముసెటి (ఇటలీ), 14వ సీడ్ టామీ పాల్ (అమెరికా) రెండో రౌండ్ దాటారు. జ్వెరెవ్ 64, 64, 64తో ఫియర్‌న్‌లె (బ్రిటన్)పై, డిమెనార్ 62, 64, 62తో మోచిజుకి (జపాన్)పై,. ముసెటి 64, 60, 62తో గోఫిన్ (బెల్జియం)పై గెలిచారు. 4 గంటలకు పైగా సాగిన పోరులో టామీ పాల్ 76 (86), 63, 57, 57, 75తో బోర్జెస్ (పోర్చుగల్)పై నెగ్గాడు. సిట్సిపాస్ (గ్రీస్) 65 (57), 61, 64, 36, 57తో ఆల్ట్‌మైర్ (జర్మనీ) చేతిలో కంగుతిన్నాడు.

రిబకినా ముందంజ: మహిళల సింగిల్స్‌లో రిబకినా (కజకిస్థాన్) ప్రిక్వార్టర్స్ చేరింది. మూడో రౌండ్లో ఈ తొమ్మిదో సీడ్ క్రీడాకారిణి 61, 62తో రదుకాను (బ్రిటన్)ను ఓడించింది. ఒకప్పుడు మహిళల సర్క్యూట్‌లో తిరుగులేని విజయాలు అందుకున్న నవోమి ఒసాకా చాన్నాళ్ల తర్వాత మళ్లీ జోరందుకుంది. ఈ జపాన్ స్టార్.. యుఎస్ ఓపెన్లో మూడో రౌండ్‌కు దూసుకెళ్లింది. రెండో రౌండ్లో 63, 61తో బాప్టిస్ట్ (అమెరికా)ను చిత్తు చేసింది. అమెరికా స్టార్, మూడో సీడ్ కాకో గాఫ్ మూడో రౌండ్ చేరింది. రెండో రౌండ్లో 67 (75), 62తో వికిచ్ (క్రొయేషియా)ను ఓడించింది. 14 విన్నర్లు కొట్టిన గాఫ్.. ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసింది. ఎనిమిదో సీడ్ అనిసిమోవా (అమెరికా), పదకొండో సీడ్ ముచోవా (చెక్), 15వ సీడ్ కసత్కినా (ఆస్ట్రేలియా) ముందంజ వేశారు. అనిసిమోవా 76 (72), 62తో జాయింట్ (ఆస్ట్రేలియా)పై, ముచోవా 76 (70), 67 (37), 64తో క్రిస్టియా (రొమేనియా)ను ఓడించారు. కసత్కినా 62, 46, 75తో రకిమోవా (రష్యా)పై నెగ్గింది. హడాడ్ (బ్రెజిల్), ఫ్రెంచ్ (పోలెండ్), సిగ్మండ్ (జర్మనీ), పారి (ఫ్రాన్స్) రెండో రౌండ్‌ను అధిగమించారు.డబుల్స్‌లో వీనస్ శుభారంభం: సింగిల్స్‌లో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో దిగి తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టిన అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్ మహిళల డబుల్స్‌లో రెండో రౌండ్లోకి దూసుకెళ్లింది. తొలి రౌండ్లో వీనస్‌లెలా ఫెర్నాండెజ్ (కెనడా) జంట 76 (74), 63తో కిచెనోక్ (ఉక్రెయిన్)పెరిజ్ (ఆస్ట్రేలియా) ద్వయాన్ని ఓడించింది.

# టెస్ట్ క్రికెట్‌లో ఆ దశను దాటడంలో సిరాజ్ సలహా సాయం చేసింది: అర్షదీప్ సింగ్

**ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ టూర్‌లో భాగంగా టీమ్‌ఇండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. ఈ సిరీస్‌ను భారతజట్టు 2-2తో సమం చేసుకోగలిగింది. ఈ టూర్‌లో అర్షదీప్ సింగ్ .. టీమ్‌ఇండియా స్క్వాడ్‌లో భాగమయ్యాడు. కానీ అతడికి బుమ్రా గైర్హాజరీలోనూ మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కలేదు. అలాగే నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు ముందు అర్షదీప్ సింగ్ గాయానికి గురయ్యాడు. దీంతో కనీసం చివరి మ్యాచుల్లోనూ భాగం కాలేకపోయాడు.**




**'బ్రాంకో'కు క్రికెటర్లు ఓకే.. మరి ఫెయిల్ అయితే పరిస్థితేంటి?**

ప్రస్తుతం అర్షదీప్ సింగ్.. దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్ తరఫున పాల్గొంటున్నాడు. క్వార్టర్ ఫైనల్లో నార్త్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ విరామ సమయంలో అర్షదీప్ సింగ్ టెస్ట్ మ్యాచుల్లో బోరింగ్ సమయం గురించి మాట్లాడాడు. ఆ దశను ఎలా దాటాలో సిరాజ్ తనకు తెలిపాడని వివరించాడు. 'గత రెండు నెలల కాలంలో నేను టెస్ట్ క్రికెట్‌లో బోరింగ్ టైమ్‌ను ఎలా ఉత్సాహంగా గడపాలో నేర్చుకున్నాను. రెడ్ బాల్ క్రికెట్‌లో కొన్ని సార్లు పరిస్థితి బోరింగ్‌గా తయారవుతుంది. ముఖ్యంగా లంచ్ తర్వాత సెషన్. అప్పుడు బంతితో మనం పెద్దగా ఏమీ చేయలేం. అప్పుడు కాస్త బోర్‌గా ఉంటుంది. ఈ విషయమై నేను ఇంగ్లాండ్ టూర్ సందర్భంగా మహ్మద్ సిరాజ్‌తో మాట్లాడాను. అప్పుడు అతడు నాకో సలహా ఇచ్చాడు. అలాంటి బోరింగ్ సమయంలో నేనువ్వు ఉత్సాహంగా ఉండగలిగితే, రెడ్ బాల్ క్రికెట్‌లో విజయం సాధించగలవు అన్నాడు. అతడు చెప్పిన ఆ చిన్న సలహా నాకు బాగా నచ్చింది' అని అర్షదీప్ సింగ్ వెల్లడించాడు.

ప్రస్తుతం జరుగుతున్న దులీప్‌ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్‌లో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 388 పరుగులు చేసింది. దీంతో ప్రస్తుతం 563 పరుగుల లీడ్‌తో పటిష్ఠమైన స్థితిలో ఉంది. అంతకు ముందు నార్త్ జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 405 పరుగులు చేస్తే.. ఈస్ట్‌జోన్ 230 పరుగులకే ఆలౌటైంది.

# రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్ పదవికి రాహుల్ ద్రవిడ్ గుడ్‌బై

**భారత మాజీ క్రికెటర్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్ పదవి నుంచి వైదొలిగాడు. ఈ మేరకు ఫ్రాంఛైజీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. ఆర్‌ఆర్‌కు సేవలు అందించినందుకు ధన్యవాదాలు చెప్పింది. గత ఐపీఎల్ సీజన్ ముందు వరకు భారత కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ద్రవిడ్.. తర్వాత ఆర్‌ఆర్‌కు వచ్చాడు. అయితే, కాలికి గాయం కావడంతో కట్టుతోనే జట్టు వెంట ప్రయాణించిన వీడియోలు అప్పుడు వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎందుకు కోచ్ బాధ్యతలు వదిలేశాడనేది తెలియలేదు.**




**'బ్రాంకో'కు క్రికెటర్లు ఓకే.. మరి ఫెయిల్ అయితే పరిస్థితేంటి?**

"ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందే రాహుల్ ద్రవిడ్ తన పదవి నుంచి వైదొలిగారు. రాజస్థాన్‌తో చాలా కాలంపాటు ప్రయాణించారు. ఆటగాళ్లపై ఆయన ప్రభావం చాలా ఉంది. ఫ్రాంఛైజీలో అద్భుతమైన సంప్రదాయం నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించారు. ఫ్రాంఛైజీలో మరింత ఉన్నతమైన స్థానం ఇస్తామని ఆఫర్ చేసినా వద్దని తిరస్కరించారు. రాజస్థాన్ రాయల్స్ ఆటగాళ్లు, అభిమానుల నుంచి ద్రవిడ్‌కు ధన్యవాదాలు చెబుతున్నాం" అని ఆర్‌ఆర్ పోస్టు చేసింది.

2024లో టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్ సాధించిన సమయంలోనే రాహుల్ ద్రవిడ్ భారత్ కోచ్‌గా తన పదవీకాలం పూర్తిచేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత అదే ఏడాది రాజస్థాన్ రాయల్స్‌కు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఈ ఫ్రాంఛైజీతో అతడికి మంచి అనుబంధం ఉంది. గతంలో ఆ జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కొంతకాలం ఆర్‌ఆర్‌కు మెంటార్‌గా పనిచేశాడు.